## క్లుప్తంగా

### నేర శాతం తగ్గించడమే లక్ష్యం



షేక్ ఖాదర్ బాషా

కారంచేడు: గ్రామాల్లోని ప్రస్తుతం నమోదు అవుతున్న నేరాల శాతాన్ని పూర్తిగా తగ్గించడమే లక్ష్యంగా పనిచేస్తామని ఎస్ఐ షేక్ ఖాదర్ బాషా అన్నారు. శుక్రవారం కారంచేడు పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ విధులు నిర్వహించిన ఎస్ఐ వి. వెంకట్రావును ఎస్పీ ఆదేశాలతో బాటప్ల వీఆర్‌కు పంపగా, అక్కడే వీఆర్‌లో ఉన్న ఎస్ఐ షేక్ ఖాదర్‌బాషాను కారంచేడు పీఎస్‌కు బదిలీ చేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో అక్రమ మద్యం అమ్మకాలు, తరలింపులు, రేషన్ అక్రమ దందాలు, పేకాట, జూదం, బెట్టింగ్‌లు, రౌడీ షీటర్లు, డ్రగ్స్ మాఫియా వంటి అన్ని అంశాలపై ప్రత్యేక దృష్టి పెడతానన్నారు.

### జలజీవన్ మిషన్ పనులు ప్రారంభం


జలజీవన్ మిషన్ పనులు ప్రారంభిస్తున్న అధికారులు

అద్దంకి రూరల్: మండలంలోని గోవాడ గ్రామంలో శుక్రవారం జలజీవన్ మిషన్ పనులు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ప్రారంభించారు. రూ.59.40 లక్షల వ్యయంతో గ్రామంలో జలజీవన్ మిషన్ పనులు ప్రారంభంతో గ్రామంలోని ప్రతి ఇంటికీ తాగునీరు అందుతుందన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

### సమయ పాలన ప్రకారం కూలి

మార్టూరు: ఉపాధి హామీ శ్రామికులు తాము పనిచేసే పని ప్రదేశాల్లో నిర్దేశించిన సమయం ప్రకారం పనిచేసి పూర్తిస్థాయి కూలీ 307 రూపాయలు పొందవచ్చని మండల ఏపీఓ లక్ష్మీనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ఇటీవల అనేక మార్పులు చోటు చేసుకున్న కారణంగా శ్రామికులు పనిచేసే ప్రదేశానికి ఉదయం 6 గంటలకు హాజరై మొదటి ఫొటోను అప్లోడ్ చేయవలసి ఉంటుందని తెలిపారు. తదుపరి నాలుగు గంటలు పనిచేసిన అనంతరం 10 గంటల సమయంలో మరోసారి హాజరు తాలూకు ఫొటో అప్లోడ్ చేయాల్సి ఉంటుందని తెలిపారు. ఇలా రెండు సార్లు ఫొటోలు నమోదు చేసుకున్న వారికి మాత్రమే వారి బ్యాంకు ఖాతాలో పూర్తిస్థాయి కూలి జమ అవుతుందని తెలిపారు. సంబంధిత ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లు ఉపాధి హామీ శ్రామికులకు అవగాహన కల్పించి పూర్తిస్థాయి కూలి పొందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

### నగదు ప్రోత్సాహకాలు అందజేత


కార్యక్రమంలో మాట్లాడుతున్న శేషుబాబు

చీరాల అర్బన్: ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు ప్రార్థన సమాజం ఆధ్వర్యంలో నగదు ప్రోత్సాహకాలను శుక్రవారం అందించారు. ఈపూరుపాలెం జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రోత్సాహకాలను అందించారు. చీరాల ప్రార్థన సమాజం అధ్యక్షుడు, రిటైర్డు బ్యాంకు మేనేజర్ ఐ.శేషుబాబు మాట్లాడుతూ అన్నింటి కన్నా విద్య ఎంతో గొప్పదని, మంచి క్రమశిక్షణతో చదువుకుంటే ఉన్నత స్థాయికి ఎదగవచ్చన్నారు. పదోతరగతి ఫలితాల్లో 592 మార్కులు సాధించిన వూట్ల హిమబిందుకు రూ.5వేలు, 588 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచిన షేక్ సుమీర్‌కు రూ.2వేలు నగదు ప్రోత్సాహక బహుమతులు అందించారు.

# వానల్లో విషాదం..!

- పిడుగులతో జాగ్రత్త
- వాతావరణ శాఖ సూచనలు పాటించాలి
- గత సంవత్సరం పాతికమంది వ్యక్తులతో పాటు 50 పశువులు మృతి


ఆకాశం నుంచి పడుతున్న పిడుగు

అద్దంకి: ఎండల్లో జనాలు పడే తిప్పలు అన్నీ ఇన్నీ కావు. అయితే ఆ తర్వాత చిరు జల్లులు పలకరించగానే వేడి అంతా చల్లబడి పోతుంది. రైతన్నలు వ్యవసాయ పనులు ముమ్మరం చేస్తారు. అలాగే ఎండిన మొక్కలు, చెట్లన్నీ పచ్చగా కళకళలాడుతాయి. ఇదంతా బాగనే ఉన్నా.. వర్షాకాలంలో ఎన్నో ప్రమాదాలు పొంచి ఉంటాయి. వర్షాల సమయంలో మేఘావృతం కావడం, ఉరుములు, మెరుపులు, పిడుగులు పడుతుంటాయి. దీంతో జంతువులు, వనుషులతోపాటు, ఆస్తి నష్టం నష్టం జరుగుతుంది. సాధారణంగా వర్షం పడే సమయంలో ఉరుములు, మెరుపులతో పాటు పిడుగులు పడుతాయి. దాని వల్ల నష్టం కలుగుతుంది. అయితే ప్రస్తుత కాలంలో ఎక్కడ వర్షం పడుతుందో, ఎక్కడ పిడుగుల పడుతాయో వాతావణ శాఖ ముందుగానే హెచ్చరిస్తుంది. ఆ హెచ్చరికలతో జాగ్రత్తపడితే పిడుగుల నుంచి రక్షించుకునే అవకాశం ఉందని వాతావరణ శాఖనిపుణులు చెబుతున్నారు.

**నియోజకవర్గంలో ఎన్నో ఘటనలు**

పిడుగుల వల్ల అనేక అనర్థాలు కలుగుతాయి. గత సంవత్సరం బాపట్ల, జిల్లాలోని సంతమాగులూరు, బల్లికురవ, అద్దంకి, తదితర మండలాల్లో పిడుగులు పడి చేలల్లో పనులు చేసుకునే దాదాపు పాతికమంది రైతులు, కూలీలతోపాటు, 50 వరకు పశువుల మృతి చెందాయి. పిడుగు అంటే ఆకాశంలో మేఘాల రాపిడి వల్ల కలిగే విద్యుదాఘాతం.

**ఒక్క పిడుగులో..**

ఒక్క పిడుగులో ఒక పట్టణ అవసరాలకు ఆరు నెలల పాటు అందించగలిగే శక్తి ఉత్పన్నం అవుతుంది. మేఘాల్లో కలిగే రాపిడి వల్ల ఉత్పన్నమయ్యే పిడుగులో 50 వేల డిగ్రీల ఫారన్ గ్రేడ్ వరకు ఉష్ణోగ్రత ఉంటుందని అంచనా. ఆ వేడి అణువులన్నీ కలిసి ఒక నాళం మాదిరిగా ఏర్పడి భూమి మీద ఉన్న పాజిటివ్ ఎనర్జీతో కలిస్తే పిడుగు అవుతుంది. ఒక మిల్లీ సెకనులో మెరుపుతో కూడిన పిడుగు 20 ఆంపియర్ల విద్యుత్ ప్రవాహాన్ని ఏర్పరుస్తుంది. ఆ సమయంలో ఏర్పడే తీవ్రత మీటర్‌కు 2లక్షల వోల్టులకు సమానం. మేఘాల మధ్యే ఏర్పడే పిడుగు సన్నని నాళం తయారై భూమిని చేరడానికి వాహకాలను వెతుక్కుంటాయి. దానికి ఎత్తున చెట్లు, ఇనుప స్తంభాలు, ఎత్తైన భవనాలు, ధ్వజస్తంభాలపై కూడా పడుతుంటాయి.

**కాపర్ ఎర్త్‌తో చెక్..**

పిడుగు నుంచి తప్పించుకునేందుకు ఎత్తైన ప్రదేశం నుంచి నేరుగా భూమిలోకి కాపర్ ఎర్త్ వైర్ (రాగి వైరును అనుసంధానం చేస్తూ భూమిలోకి పాతాలి) ఏర్పాటు చేసుకోవాలి. ఇది దాదాపు కిలో మీటరు దూరంలో పడిన పిడుగును నేరుగా భూమిలోకి ఆకర్షిస్తుంది. ఉప్పు, కర్బూరబొగ్గు, మిశ్రమాలతో రాగి వైరు కలిగిన రాడ్‌ను భూమిలోపలకు ఏర్పాటు చేయడం వల్ల ప్రమాదాలను నివారించుకోవచ్చు.

**ఇలా చేయాలి..**

వర్షం కురిసే సమయంలో ఎత్తైన చెట్ల పై పిడుగులు పడే అవకాశం ఉంది. అందుచేత చెట్ల కింద ఉండకూడదు. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే సమయంలో పొలాలు బహిరంగ ప్రదేశాల్లో ఉండకూడదు. వర్షం కురుస్తున్న సమయంలో అందరూ గొడుగులను వాడుతుంటారు. అయితే వాటిపై ఇనుప బోల్టులు లేకుండా చూసుకోవాలి. మీ దగ్గర కెమెరాలు, సెల్‌ఫోన్లు ఉంచుకోకూడదు. లేకుంటే రేడియేషన్ తరంగాలకు గురై ప్రమాదం జరుగుతుంది. మెరుపులు పిడుగుల వల్ల విద్యుత్ ఉపకరణాలు పాడయ్యే అవకాశం ఉన్నందున, ఆ ఉపకరణం పనిచేయడానికి ఉపయేగపడే మెయిన్స్ కార్డ్‌ను ప్లగ్ నంచి తీసేయాలి. వర్షం కురుస్తున్న సమయంలో విద్యుత్ తీగల కింద ట్రాన్స్‌ఫార్మర్ల కింద, సమీపంలో కూర్చోకూడదు. ఉరుములతో కూడిన వర్షం పడే సమయంలో చెరువులు, నది, సముద్రంలో ఈత కొట్టకూడదు.

## విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి


బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దుద్దుకూరు జెడ్పీ పాఠశాల సిబ్బంది

ఇంకొల్లు(చినగంజాం): బడుగు, బలహీన వర్గాల్లోని విద్యార్థుల అభివృద్ధి కోసం ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారని దుద్దుకూరు పాఠశాల హెచ్ఎం కఠారి భాస్కరరావు అన్నారు. ఇంకొల్లు మండలం దుద్దుకూరులోని ఆచార్య రంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇటీవల నిర్వహించిన బదిలీల్లో వెళ్లిన ఉపాధ్యాయులకు శుక్రవారం వీడ్కోలు సన్మాన సభ నిర్వహించారు. సభలో దుద్దుకూరు గ్రామ వికాస్ తరఫును ఎన్నారై రాయని సుబ్బరామయ్య, చెన్నుపాటి జనార్ధనరావు దుద్దుకూరులో హైస్కూల్, మోడల్ ప్రాథమిక పాఠశాల, ఫౌండేషన్ పాఠశాలల్లో పనిచేసి బదిలీలు పొందిన ప్రస్తుతం పనిచేస్తున్న, బదిలీపై కొత్తగా వచ్చి చేరిన ఉపాధ్యాయులందరికీ మెమెంటోలు అందజేసి శాలువాలుతో ఘనంగా సన్మానించారు. బదిలీపై వెళ్లిన పరిమి రామకృష్ణ, కె. శ్రీలక్ష్మి, భాస్కరరావు, యం. సురేష్ బాబు, టి. రత్నకుమారిలను ఘనంగా సన్మానించారు. కొత్తగా వచ్చిన ఉపాధ్యాయులను ఘనంగా ఆహ్వానించారు. ఎన్. శ్రీనివాసచార్యులు, యు. చెంచయ్య, కె. శంకరరావు, బి. బాల సుబ్రహ్మణ్యం, బి. చినబాబు, పి. వెంకటరావు, కె. విజయకుమారి పాల్గొన్నారు.

## హెచ్ఐవీ స్క్రీనింగ్ టెస్ట్ చేయించుకోవాలి


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ చంద్రశేఖర్

పర్చూరు(చినగంజాం): సంవత్సరానికి ఒకసారి హెచ్ఐవీ స్క్రీనింగ్ టెస్ట్ చేయించుకోవాలని ఉప్పుటూరు హోమియో వైద్యులు డాక్టర్ దాసరి చంద్రశేఖర్ సూచించారు. జాతీయ హెచ్ఐవీ టెస్టింగ్ దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఉప్పుటూరులో గ్రామస్తులకు హెచ్ఐవీ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధి లైంగిక సంపర్కం, రక్త మార్పిడి, ఒకరికి వాడిన సూదులను మరొకరికి వినియోగించడం వల్ల వస్తుందని వివరించారు. సమాజంలో పాజిటివ్ వ్యక్తులను చిన్నచూపు చూడకూడదన్నారు. వ్యాధి వచ్చిన తరువాత వైద్యం చేయించుకునే దాని కంటే దాని కంటే వ్యాధి రాకుండా ముందు జాగ్రత్త వహించడం ఉత్తమం అన్నారు. శుక్రవారం జాతీయ సురక్షిత పని ప్రదేశ దినోత్సవం సందర్భంగా గ్రామంలోని పారిశుద్ధ్య కార్మికులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. దేశంలో సంవత్సరానికి సుమారు 8 లక్షల మరణాలు కేవలం పారిశుద్ధ్య లోపం వల్లే సంభవిస్తున్నాయని తెలిపారు. పారిశుద్ధ్య కార్మికులు తమ విధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు.

# చెత్త సేకరణపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ, ఈఓపీఆర్డీ

కొడవలివారిపాలెం (కారంచేడు): గ్రామాలను శుభ్రంగా ఉంచేందుకు, పరిశరాల పరిశుభ్రతకు అవసరమైన కార్యక్రమాలపై ప్రజల్లో అవగాహన పెంచాల్సిన అవసరం ఉందని ఎంపీడీఓ కె. నేతాజీ అన్నారు. శుక్రవారం మండలంలోని కొడవలివారిపాలెం, స్వర్ణపాలెం, నందిగుంటపాలెం ప్రాంతాల్లో తడి, పొడి చెత్తల సేకరణపై మహిళల్లో అవగాహన కల్పించారు. చెత్త లేకపోతే గ్రామాల్లో దోమలు వ్యాపించవని, వాటి ద్వారానే వ్యాధులు సంక్రమిస్తాయని ఆయన పేర్కొన్నారు. ఈఓపీఆర్డీ ఎల్‌కే కృష్ణ, కార్యదర్శులు రేవతి, ఆషాజ్యోతి, గ్రీస్ అంబాసిడర్ పాల్గొన్నారు.

# మానవత్వం చాటిన న్యాయమూర్తి


కోర్టు ఆవరణలో దివ్యాంగులను విచారిస్తున్న న్యాయమూర్తి కాత్యాయని

చీరాల రూరల్: కోర్టు హాలులోకి రాలేని ఇద్దరు దివ్యాంగులుపట్ల న్యాయమూర్తి తన ఉదార స్వభావాన్ని ప్రదర్శించారు. న్యాయమూర్తి తన న్యాయపీఠాన్ని దిగి వారివద్దకు స్వయంగా వెళ్లి కేసును విచారించి మానవత్వాన్ని చాటుకున్నారు. సంఘటన గురువారం చీరాల కోర్టులో చోటుచేసుకోగా శుక్రవారం వెలుగుచూసింది. చీరాలకు చెందిన ఇద్దరు దివ్యాంగులు ఓ క్రిమినల్ కేసులో చీరాల ఏఎంఎం కోర్టులో విచారణకు హాజరయ్యారు. అయితే ఆ ఇరువురు పూర్తిగా దివ్యాంగులు కావడంతో తమ ద్విచక్రవాహనాల నుంచి కిందికి దిగలేక కక్షిదారుల మధ్యలో ఉండిపోయారు. దీంతో కోర్టు సిబ్బంది విషయాన్ని అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కాత్యాయని దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే స్పందించిన న్యాయమూర్తి తన న్యాయపీఠాన్ని దిగి వారివద్దకు వెళ్లి వారిని విచారించి వారి వాంగ్మూలాన్ని నమోదు చేసుకున్నారు. ఈ సంఘటన చూసిన తోటి కక్షిదారులు, న్యాయవాదులు ఇటువంటి సంఘటనలు ఎక్కడో ఒకచోట చాలా అరుదుగా జరుగుతుంటాయని న్యాయమూర్తి తీరుపట్ల హర్షం వ్యక్తం చేశారు.

## మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు

పర్చూరు(చినగంజాం): ఏపీ మార్క్‌ఫెడ్ ద్వారా పర్చూరు నియోజకవర్గంలో పొగాకు పండించిన ప్రతి ఒక్క రైతు పంటను కొనుగోలు చేయడం జరుగుతుందని పర్చూరు మండల వ్యవసాయాధికారి కె. భాస్కరరావు తెలిపారు. పొగాకు పంట సాగు చేసిన రైతులు పొగాకును అమ్ముకోవడానికి ముందుకు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని అందుకోసం రైతులు గతంలో ఏ గ్రామం నుంచి ఫొటో దిగారో ఆ గ్రామంలోని రైతు సేవా కేంద్రంకు వెళ్ళి ఏ మండలం, ఏగ్రామంలోనైనా సాగు చేసిన భూమి వివరాలను వీఏఏకి ఇచ్చి ఏపీఏఐఎంఎస్ యాప్‌లో నమోదు చేయించుకోవాలన్నారు. తరువాత సీఎం యాప్‌లో రైతు వివరాలు, ఆధార్ ద్వారా ఓటీపీ లేదా వేలిముద్ర ద్వారా నమోదు చేసి రైతు ఫొటో తీసి రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేస్తారని తెలిపారు. రిజిస్ట్రేషన్ పూర్తి అయిన వెంటనే రైతు మొబైల్‌కు రిజిస్ట్రేషన్ వివరాలు మెసేజ్ ద్వారా అందుతాయని తెలిపారు. పొగాకు ధరలు క్వింటాల్లో హై గ్రేడు రూ. 12 వేలు, మీడియం గ్రేడు రూ. 9 వేలు, లో గ్రేడు రూ. 6 వేలు అని తెలిపారు. ఇప్పటి వరకు 2500 టన్నులు రైతుల వద్ద నుంచి కొనుగోలు చేస్తామన్నారు. రైతులు పొగాకులో తేమ శాతం 20 శాతం కన్నా తక్కువగా ఉండేలా చూసుకోవాలని సూచించారు.

### తహసీల్దార్‌కు కలెక్టర్ ప్రశంసలు


అవార్డు అందుకుంటున్న తహసీల్దార్ రవికుమార్

యద్దనపూడి: తహసీల్దార్ కాకి రవికుమార్‌కు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ అవార్డు లభించింది. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీలో ఎక్కువ మంది సభ్యులను చేర్పించినందుకు ఆయనకు ఈ గౌరవం దక్కిందని ఆయన శుక్రవారం తెలిపారు. కలెక్టర్ జె. వెంకట మురళి చేతులమీదుగా అవార్డును అందుకున్నట్లు చెప్పారు.

### అద్దంకి ఏడీఏగా ఎఫ్రాయిమ్

అద్దంకి: అద్దంకి ఏడీఏగా బీ ఎఫ్రాయిమ్ శుక్రవారం బాధ్యతు చేపట్టారు. ఒంగోలు ఏడీఏగా పనిచేస్తూ బదిలీపై అద్దంకి ఏడీఏగా నియమితులయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న కె. ధన్‌రాజ్ బాపట్ల బదిలీ అయ్యారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఏడీఏ ఎఫ్రాయిమ్‌కు అద్దంకి మండల వ్యవసాయాధికారి కొర్రపాటి వెంకటకృష్ణ, తోపాటు సిబ్బంది, డివిజన్‌లోని వారంతా పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేశారు.

### రీ సర్వేలో లోపాల సవరణ

పర్చూరు(చినగంజాం): భూముల రీసర్వేలో భాగంగా తలెత్తిన సాంకేతిక లోపాలను సరిదిద్దుకునేందుకు రైతులు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ పి. బ్రహ్మయ్య తెలిపారు. మండలంలో రీ సర్వే జరిగిన అడుసుమల్లి, గర్నెపూడి, దేవరపల్లి, గొల్లపూడి గ్రామాల్లో అధికారులు రెండు పొలాలకు ఒక ఎల్పీఎం నంబరుని కేటాయించారని దీంతో రైతులు సాంకేతికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఏపీ ప్రభుత్వ సర్వే శాఖ డైరెక్టర్ ఆదేశాల మేరకు సమస్యను పరిష్కరించుకునేందుకు రైతులు రూ. 50 ఫీజు చెల్లించి ఈ నెలాఖరులోగా దరఖాస్తు చేసుకోవాలని భూ సమస్యలను పరిష్కరించుకోవాలని తహసీల్దార్ తెలిపారు.

**యద్దనపూడిలో..**

మండలంలోని వింజనంపాడు, యద్దనపూడి, గన్నవరం జాగర్ల మూడి గ్రామాల్లో రీసర్వే జరిగినందున తప్పులు దొర్లియాయని వాటిని రైతులు సరి చేసుకునేందుకు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ కె. రవి కుమార్ తెలిపారు. రైతులు రూ. 50 చెల్లించి ఈ నెలాఖరులోగా దరఖాస్తు చేసుకోవాలని.. ఆ తరువాత నెలాఖరు దాటితే రూ. 550 ఫీజును చలానాగా చెల్లించాలని తెలిపారు.

### దొంగ రిజిస్ట్రేషన్ బాధ్యులపై చర్యలు తీసుకోండి

చీరాల రూరల్: పేదలకు ఇచ్చిన భూమిలో లారీ అసోసియేషన్ పేరుతో ఎటువంటి అనుమతులు లేకుండా లారీ అసోసియేషన్ పేరుతో బిల్డింగు నిర్మించి దానికి దొంగ రిజిస్ట్రేషన్ చేయించిన వారిపై చర్యలు తీసుకోవాలంటూ శుక్రవారం చీరాల హరిప్రసాద్ నగర్‌కు చెందిన వల్లెపు బాల అంకమ్మరావు అనేవ్యక్తి చీరాల ఆర్డీవోకు ఫిర్యాదు చేశాడు. చీరాల శివారు ప్రాంతమైన కారంచేడు రోడ్డులోని పంట పొలాల్లో గతంలో కొందరు నిరుపేదలకు ప్రభుత్వం సర్వే నంబర్ 66/1, 66/7, 66/8లో భూములు ఇచ్చిందని, ప్రస్తుతం లారీ అసోసియేషన్ పేరుతో కొంత భూమిని కొనుగోలుచేసి మున్సిపాలిటీ అనుమతిలేకుండా బిల్డింగు నిర్మించారని అంతేకాక దానికి దొంగ రిజిస్ట్రేషన్ చేయించారని అంకమ్మరావు చెబుతున్నాడు. తక్షణమే ఆర్డీవో కలగచేసుకుని వారిపై చీటింగ్ కేసులు నమోదు చేయాలని కోరుతున్నాడు.





# మొహరం వేడుకలకు పీర్ల చావిడి ముస్తాబు



కొప్పరపాడులో ముస్తాబు చేసిన పీర్ల చావిడి


వేడుకల అంకురార్పణలో భాగంగా కేక్ కట్ చేస్తున్న ఆదామ్ సాహెబ్

బల్లికురవ: మొహరం వేడుకల్లో భాగంగా తాతముత్తాతల సమయంలో నిర్మించిన పీర్ల చావిడి జీర్ణావస్థకు చేరటంతో పునః నిర్మాణంతో శుక్రవారం ప్రారంభించారు. మండలంలోని కొప్పరపాడు గ్రామంలో పీర్లచావిడిని 5 దశాబ్దాల క్రితం నిర్మించారు. గ్రామానికి చెందిన షేక్ ఆదాం సాహెబ్, సుభాని, సైదా పునఃనిర్మించాలని ఇటీవల సంకల్పించారు. దీంతో సుమారు రూ.1.6 లక్షల అంచనాలతో నిర్మాణ పనులు పూర్తి చేయించి ఆదామ్ సాహెబ్ చేతుల మీదుగా ప్రారంభించి మొహరం వేడుకలకు అంకురార్పణ చేసి కేక్ కట్ చేశారు. 4 రోజుల పాటు వేడుకలు నిర్వహిస్తున్నామని గ్రామంలోని ప్రతి ఒక్కరూ ఈవేడుకల్లో పాల్గొన్నాలని కోరారు. వేడుకల సందర్భంగా పీర్ల చావిడిని విద్యుత్ దీపాలతో అలంకరించి ముస్తాబు చేశారు. గ్రామంలో ప్రతి ఇంటా పండగ వాతావరణం నెలకొంది.

### ఆర్పీలకు ట్యాబ్‌లు

చీరాల: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో పనిచేస్తున్న 56 మంది ఆర్పీలకు ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య ట్యాబ్‌లు అందించారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మెప్మా విభాగంలో పనిచేస్తున్న 56 మందికి రూ.30వేలు విలువ గల ట్యాబ్‌లను అందించారు. గతంలో మాన్యువల్‌గా తమ పని చేసేవారని, ఇప్పుడు ట్యాబ్‌లతో డిజిటలైజేషన్ అవుతుందన్నారు. ట్యాబ్‌లతో మెరుగైన సేవలను అందించాలన్నారు. మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్, మెప్మా సీఎంఎం డి.కొండయ్య పాల్గొన్నారు.

### పోలింగ్ బూత్‌లు పెంచుతాం

బల్లికురవ: పోలింగ్ బూత్ దూరంగా ఉండి, ఓటర్లు అధికంగా ఉంటే కొత్త బూత్‌లు ఏర్పాటు చేసేందుకు అభిప్రాయాలు సేకరిస్తామని అద్దంకి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారులు విజయజ్యోతికుమారి తెలిపారు. శుక్రవారం మండలంలోని కూకట్లపల్లి యానాది సంఘం, కొత్తూరు, అంబడిపూడి గ్రామాలోని పోలింగ్ బూత్‌లను ఆమె పరిశీలించారు.